# రాజారావుగారి ఇల్లు

## — వేదుల శకుంతల

సంధ్యారాగానికి చివరి చరణం పాడు తున్నట్టుంది, ప్రకృతి! మరికొన్ని క్షణాలలో దినకరుడు దిగంతాలకి జారిపోయే తరుణం! వెలుగు చీకట్ల తొలిక లయికలా... పగలు పలచబడుతూ రాత్రికి చిక్కదనం అందిస్తున్న సంగమ సమయంలా వుంది ఆ సాయంకాలం!

క్లబ్ ఆవరణలో-బ్యాడ్‌మింటన్—త్రోబాల్, ఫుట్‌బాల్ ఆడుతున్నారు, కొందరు యువకులు! ఆ కాంపౌండ్ పక్కనే ఖాళీస్థలంలో కబడీ, దాగుడు మూతలు ఆడుతూ కేరింతలు కొడ్తున్నారు కొందరు చిన్నపిల్లలు.

ఎక్కడో దూరంగా వినిపిస్తోంది, శ్రావ్యమైన లలిత సంగీతంలో ఓ గాయని గొంతు!

బాల్కనీలో పిట్టగోడ దగ్గరగా కుర్చీవేసుకుని కూర్చుని కంటికి కనిపిస్తున్న దృశ్యాలనీ... చెవులకి వినిపిస్తున్న రాగాన్నీ... చూస్తూ వింటూ వుండిపోయింది అపర్ణ! చూస్తున్న వాటికిగానీ... వింటున్నవాటికిగానీ ఆమెలో ఏ విధమైన కదలికా లేదు. ఓ ప్రతిమలా నిశ్శబ్దంగా... నిర్జీవంగా వుంది ఆమె ఉనికి! నిర్వేదంతో నిరాసక్తంగా-వుంది ఆమె మనసు!

* * *

వెడల్పాటి జరీచీర కట్టుకుని కొండగుర్తు అనిపించే ఓ చేతి అటో దిగి—బ్యాగ్‌లోంచి ఎడ్రసుకా గితం తీసుకుని... ఇంటినెంబర్లు చూసుకుంటూ చకచకా ముందుకు నడుస్తోంది, వైదేహి.

ఎన్నో సంవత్సరాలు వెనక్కి వెళ్లి... అక్కడ... ఆనాటి... స్మృతులన్నీ కదిలించుకుని మళ్లీ... వర్తమానపు ముల్లు పై నిలుస్తోంది, ఆమె మనోవేగపు యంత్రం! ఇళ్లనెంబ ర్లు వెతుక్కుంటూ అపర్ణతో పరిచయం నుంచి అన్నీ గుర్తుకి తెచ్చుకుంటోంది.

ఆనాడు పక్కవాటాలో కొత్తగా చేరిన కుటుంబం. వాళ్ల మూడో అమ్మాయి అపర్ణ! స్కూల్లో చేరడానికి తనతో మొదటిసారిగా చేసుకున్న పరిచయం... ఎంత తమాషా గా సాగిందీ?

"స్కూలుకు వెళుతున్నారా?" అని అడిగింది.

'అవును' అంది తను.

"ఏ క్లాసు?"

"ఏడోక్లాసు!"

—"అరె నేనూ అదే! ఎంచక్కా కలిసి పాఠాలు చదువుకోవచ్చునుగదూ? తెలియనివీ, క్లాసులో అర్థంగా నివీ ఒకళ్లకొకళ్లం చెప్పుకోవచ్చును... అన్నట్టు మీరు.. ఛ! మీరేమిటి ఎవరో పెద్దవాళ్లూ పరాయివాళ్లలాగ... నువ్వు సంగీతం నేర్చుకుంటున్నావా?"

'లేదు'... అంది తను.

'ఫరవాలేదు నేర్చుకుందువుగానిలే! ఇద్దరం కలిసి నేర్చుకోవచ్చును...' అంది ఆ అమ్మాయి... అపర్ణ!

"ఏదీ మీరు నిన్ననే కొత్తగా వచ్చారు, ఈ వాటాలోకి. ఇంకా స్కూల్లో చేరనేలేదు... ఇది కాక సంగీతం కూడానా?"

"భలేదానివే! స్కూల్లో ఎటూ చేరతాను... ఇంతకు ముందు సంగీతం నేర్చుకుంటూనే వున్నాను గనుక అదీనూ..." అంది దృఢంగా.

తను అబ్బురంగా చూసింది! ఎంత ధైర్యం... ఎంత పట్టుదల!

తను ఇంట్లో ఏదైనా అడగాలంటే భయం. స్వతహాగా తను చాలా బిడియస్తురాలు. చదువు అంటే చదువు తోందిగాని... సంగీతాలకి, డాన్సులకి... పంపరు...

'టైము అవుతోంది. వెళ్లు.... నేను రేపు చేరుతాను...' అంది అపర్ణ.

ఆ రేపు—వచ్చింది. అపర్ణకూడా వచ్చింది. వచ్చిన గంటలో క్లాసులోని సగం మందితో స్నేహం కలిపేను కుంది. వారంరోజుల్లో టీచర్లను ఆకట్టుకుంది. నెలరో జుల తర్వాత క్లాసు మానిట్రెస్ అయింది. వెనుక కూర్చునే అకతాయి పిల్లలు సైతం ఆ అమ్మాయి నవ్వుతూ చూస్తే... చాలు... బుద్ధిగా కూర్చునేవారు.



స్కూల్‌డే నాడు అపర్ణ నిర్వహించిన పాత్రలు ఎన్నెన్నో?... చూస్తేతప్ప... చెప్తే నమ్మలేని ప్రజ్ఞలు కొందరిలో సహజంగా వుంటాయి! సంగీతం నేర్చుకుంటోంది గనుక చక్కగా పాడింది. స్టేజిమీద హావభావాలు ప్రకటిస్తూ నాట్యం చేసింది... స్కూల్లో చాలామంది దృష్టి అపర్ణచుట్టూ అల్లుకుపోయింది.

హైస్కూలు చదువు ముగిసేసరికి ఆ అమ్మాయంటే... సూక్ష్మగ్రాహి అనీ—అసాధారణమైన పిల్లనీ అందరూ అనుకున్నారు. భయంగా, మౌనంగా... ఎప్పుడూ పిరికిగా వుండే తనని కూడా... ఎంతో ముందుకు నడిపించింది... ఆ తర్వాత... కాలేజి చదువుకు తనని ప్రోత్సహించి—తనకోసం... ఇంట్లో అమ్మన్ని నాన్నని బ్రతిమాలి... ఒప్పించింది!!

తను గ్రాడ్యుయేట్ అయింది... పెళ్లై.... అత్తవారింటికి వెళ్లేముందు.... 'వీలైతే ఎమ్.ఎ.చదువు... బొత్తిగా వంటింట్లో కాలక్షేపం చేసేయకు' అని హెచ్చరించింది... ఆ హెచ్చరింపుకు "వారు" నవ్వేరుకూడా!

ఆ తర్వాత... ఎప్పుడైనా వంటింట్లో పనితీరక అవస్థపడుతుంటే... 'ఏమోయ్!—ఏమిటి? వంటింట్లోనే కాలక్షేపం చేసేస్తున్నావా? మీ ఫ్రెండ్‌మాటలు మర్చిపోయావా? ఎప్పుడైనా వస్తే... నా మీద కేసు పెట్టగలదు సుమా? నిన్ను నేను వంటింట్లో 'అరెస్ట్' చేసేనని—ఇది అన్యాయం అని వాదిస్తుంది. కాస్త ఆ గది వదిలి ఇవతలకిరా!' అంటూ జోక్ చేసేవారు.

తను అంతటి చికాకులోను నవ్వేది—....

కారు హారన్ వినిపించి—ఉలిక్కిపడి పక్కకి జరిగింది వైదేహి! నాలుగైదు ఇళ్లు దాటి—నెంబరు చూసింది... అదే నెంబర్!

ఎదురుగా క్లబ్... పక్కనే చిన్నపిల్లలు కొందరు ఆడుతున్నారు... 'హమ్మయ్య! పట్టుకోగల్గేను' అనుకుంది వైదేహి! ఆ సమయంలో ఆమె ఎదనిండా ఉద్వేగం వెల్లువై... అణుచుకోలేక కంపించిపోతోంది! ఆ చైతన్య స్రవంతిని కళ్లారా చూడబోతున్నాను... అనుకుంటూ ఆ ఆనందానికి మనసుని సిద్ధం చేసుకుంటోంది.

బాల్కనీలో కూర్చున్న అపర్ణ ఊహాసాగరంలోంచి తెప్పరిల్లింది...

కిందనుంచి మామగారు "ఇదిగో అపర్ణా! నికోసం ఎవరోవచ్చారు" అని పిల్చేరు. మెల్లగా లేచివచ్చి మెట్లు దిగబోతూ కిందకి చూసింది. కిందనుంచి రెండు మెట్లు పైకి ఎక్కుతూ—పైకి చూసింది వైదేహి!

కొన్ని క్షణాలపాటు కాలం ఆగిపోయినట్లైంది.

ఇద్దరిమధ్య విభ్రాంతి నిండిపోయింది.

పదిహేను సంవత్సరాల తర్వాత—ఇన్నాళ్లకు మళ్లీ చూసుకున్న మిత్రురాళ్ల హృదయాలు—చిత్రంగా స్పందించేయి!

"అపర్ణ... అపూ... అపూ... మా అపూ... ఇదా? ఇదేనా?" వైదేహి పెదవులు కంపించేయి!...

యువప్రాయంలో కొందరికి ఎన్నెన్నో ఆదర్శభావాలు వుంటాయి. నిస్పృహ, నిర్లిప్తత జీవితంలో చోటు చేసుకోకూడదని, గలగల పారే యేరులా, చైతన్యవంతంగా వుంటూ, నలుగురినీ కూడగట్టుకుని, తమకున్న పరిథిలో సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చెయాలనీ అనుకుంటారు. ఆ కృషిలో ఎందరికో ప్రేరణ కలిగించి, వాళ్ళ జీవిత ధోరణినే మార్చేస్తుంటారు. అలాంటి చైతన్య మూర్తులను అర్థం చేసుకుని, ప్రోత్సహించే జీవిత భాగస్వామి లభిస్తే—వాళ్ళు పొందే ఆనందం ఇంతా అంతా కాదు. కానీ అందుకు విరుద్ధంగా జరిగితే, వాళ్ల జీవితాలు ఏమౌతాయి?

'వైదేహి... వచ్చావా? ఎన్నాళ్లకి చూసేనే నిన్ను? అబ్బ!" జీవం పోసుకుంటోంది... స్మృతిపథం!!

చకచకా మెట్లు ఎక్కింది వైదేహి, అపర్ణ నాలుగుమెట్లు దిగేసరికి!

"అపూ!"

"వైదీ!"

ఇద్దరు ఆప్యాయంగా... ఆనందంగా ఆలింగనం చేసుకున్నారు! "నేను ఇక్కడ వున్నానని ఎలా తెలును? ఒక్కదానివే వచ్చావా?—ఎక్కడ దిగేవ్? పిల్లలెందరు?..." ఆత్రంగా అడుగుతున్న అపర్ణని ఆపి "ఎక్కడైనా కూర్చుందాం" అంది వైదేహి.

"రా! రా!" అంటూ వైదేహిని మెట్లెక్కించి బాల్కనీలోకి తీసుకువచ్చింది అపర్ణ.

ఇద్దరు చెరొక కుర్చీలో కూర్చున్నారు... అప్పటికి—సాయంకాలపు చల్లగాలి మొదలైంది.

"అపూ ఈ హైద్రాబాదులో... మా చిన్న మామగారు వాళ్లు వున్నారు. రేపు ఉదయం సుల్తాన్ బజారులో వాళ్ల అమ్మాయి జ్యోతికి పెళ్లి! అందుకోసం మేము ముందే ఇక్కడికి వచ్చాం! మీ వారికి తెలిసిన మూర్తి—అదే, సి.వి.రమణమూర్తి... మా జ్యోతికి దగ్గర బంధువు, ఆయనికి మీ అడ్రస్ తెలును. సరే ఓసారి నిన్ను చూసివస్తానంటే.. కాదు పెళ్లికి పిలవమని... మా చిన్నత్తగారు చెప్పేరు" అంది వైదేహి, అపర్ణ చేతిలో కార్డు పెడుతూ.

"అయితే పెళ్లిపిలుపన్నమాట!"

"అంతకన్నా—నిన్ను చూడడమే ముఖ్యం అనుకో! ఎన్నాళ్లకి కల్సుకున్నాం! మా పిల్లలు పెళ్లిపనుల సందట్లో వుండిపోయారు. లేకపోతే తీసుకొచ్చేదాన్ని. ఇద్దరు అబ్బాయిలు... ఓ అమ్మాయి. ఊ! చెప్పు నువ్వు... ఏం చేస్తున్నావ్? ఎంతమంది పిల్లలు?... నీ—ఏక్టివిటీస్ ఏమిటి? అసలు నువ్వు ఈ సమయంలో ఇంట్లో వుంటావోలేదో... ఏ లేడీస్‌క్లబ్‌లో వుంటావో అనుకున్నాను" వైదేహి మాటలకు అపర్ణ చిన్నగా... అతి పేలవంగా నవ్వింది!

"నయమే! అలా అనుకుని వెళ్లిపోలేదు... వెతుక్కుంటూ వచ్చావు! మాకు నలుగురు పిల్లలు... ముగ్గురు మగ, ఒక ఆడ. ఎక్కడో ఆటల్లో వున్నట్టున్నారు... వచ్చేటప్పటికి—వడ్డించి వుంచాలి లేకపోతే... ఆగలేరు... అందులో ఒక్కొక్కళ్లకి ఒక్కోరుచి!—సరే మా మామగారు, మరిది ఇక్కడే వుంటారు.... వాళ్ల రుచులు మళ్లీవేరు... అందుకని... అందరికీ కావల్సిన విధంగా చేసి పెట్టడానికి... ఒక విధంగా వంటింట్లో సగం రోజంతా సరిపోతుంది. మధ్యలో వారి ఫ్రెండ్స్ వస్తే... కాఫీలు... టిఫెన్లు తప్పవు కదా?... అంచేత—కొత్త వంటకాలు... కొత్త ప్రయోగాలు... ఇంక ఇవే నా ఏక్టివిటీస్! ఆ తర్వాత పిల్లలకి పాఠాలు చెప్పడం... వాళ్ల డ్రస్సులు చూడ్డం... షాపింగ్... ఇంతకన్నా ఏముంటాయి?"

అతి సాధారణ మనిషిగా—సామాన్య గృహిణిలాగ-సగటు ఇల్లాలుకంటే-ఇంకా కిందిస్థాయిలో నిదానంగా చెప్తున్న అపర్ణని చూస్తుంటే వైదేహికి అయోమయంగా అనిపించింది.

ఏమిటి? అపర్ణ ఇలా చెప్తోంది? తమాషా చేస్తోందా?

"ఎందుకలా చూస్తున్నావ్?" అంది అపర్ణ.

"ఆ.... ఏంలేదు... ఏమైనా జోక్‌చేస్తున్నావా? అపూ..."

"జోకా?! ఇందులో జోకేముంది. ప్రతిరోజు జరిగే యదార్థమిదే! ఏం ఈ పనుల్లో అంత జోక్ చెయ్యడానికి ఏమున్నాయి?"

"అబ్బే.... నా వుద్దేశ్యం అదికాదు. నువ్వు చెప్పిన పనులన్నీ ప్రతి ఇల్లాలికి లేక స్త్రీకి నిత్యం జీవితంలో అతి సహజమైన దినచర్యలో భాగాలు... ప్రత్యేకించి చెప్పుకోనక్కర్లేదు. కాని.... నీలాంటి ఐమీన్... స్వతహాగా చలాకీతనం... చైతన్యం... గల నువ్వు... గృహిణిగా... మహిళాలోకానికి ఎన్నెన్నో ప్రణాళికల్ని రూపొందించి అభ్యున్నతపథానికి తీసుకుపోగలవు. నీ వ్యక్తిత్వం అటువంటిది! పైగా... మీ వారు ఐ.ఎ.యస్ రాంక్‌కి సమానమైన రాంక్‌లో వున్న గవర్నమెంట్ ఆఫీసర్! అందుచేత మరింత ఉత్సాహంగా-ఆర్థికంగా కానీ... పలుకుబడితో కానీ—నువ్వు ఎన్నో ప్రగతి కార్యక్రమాలు చేయగలవు..."

"ఆగాగు! 'గలవు' అనడం వేరు! చేయగలగడం వేరు"... అని నిర్వేదంతో ఓ పొడి నవ్వు నవ్వి...

"నేను... ఏ ప్రణాళికలు రూపొందించి ఏ అభ్యుదయాలూ సాధించటంలేదు... ఏదో ఇల్లు... పిల్లలు.... భర్తా... బంధుజనం... వీళ్లని సరిగ్గా చూసుకుంటే చాలదూ? అవన్నీ వదిలేయ్... ఇన్నాళ్లకి చూసుకున్నాం...

మి సంసారాన్ని గురించి చెప్పు. ఎక్కడైనా ఇల్లు కట్టుకున్నారా? మీరే వుంటున్నారా?... మీ అత్తమామలు కూడా వున్నారా?... మీ పిల్లలు ఏం చదువుతున్నారు?... మీవారు ఎలావున్నారు? లావెక్కేరా? పెళ్లిలో చూసేను... చాలా సన్నగా వుంటారు కదా? అవునూ... అడగనేలేదు... ఈ చీర కంచిపట్టేనా? ఆ ఇప్పుడు ఈ బార్డర్ చీరలు రావటంలేదు సుమా?... ఏమిటీ, ఏదో కొత్త నమూనా గొలుసులా వుంది మెళ్లో...?'' వంగి చూడబోతున్న అవర్ణని విడ్డూరంగా చూసి... బాధగా నిట్టూర్చింది—వైదేహి!

చిన్నప్పుడే... ఎంతో ఉత్తేజంగా... సెలయేరులా గలగలా ప్రవహిస్తూ... ప్రక్కనున్నవాళ్లమీద చెట్టాపట్టాలేసి... ముందుకు నడిపిస్తూ... తన ప్రతిభతో అందర్నీ ప్రభావితుల్ని చేసేది. వయస్సుకి మించిన ఆదర్శభావాలు ఆనాడే వెల్లడించేది. అదంతా బాల్యపు పొంగు... యవ్వనపు ఉద్రేకంలే అని... సరిపెట్టుకోవాల్సిన మనిషి కాదు అవర్ణ! ఇంటా బయటా కూడా... అందర్నీ మెప్పించి ఒప్పించగల నేర్పూ... ఓర్పూ... గల ఓ ప్రత్యేక వ్యక్తిత్వం సంతరించుకున్న అపురూపవ్యక్తి అవర్ణ! బాహ్యసౌందర్యానికి వృద్ధాప్యం వస్తుందిగానీ ఆత్మసౌందర్యానికి రాకూడదు. అది మరణంకన్నా దుర్భరమైనది!

జీవనదిలా... కలకల లాడుతూ... వుండాల్సిన అవర్ణ... ఇంత పిల్లకాలవలా... కుదించుకుపోయి... నీరసంగా మాట్లాడుతోందేమిటి?—అనుకుంటూనే, అడుగుతున్న వాటికి జవాబులిస్తోంది వైదేహి.

చల్లగాలి చిక్కబడి చలిగా మారింది.

ఆవరణలో ఆటలు ఆగిపోయేయి... లేచి లైట్లు స్విచ్ ఆన్ చేసింది అవర్ణ. ఇంతలో పిల్లలు వచ్చారు... "మమ్మీ... మమ్మీ'' అంటూ గబగబ పైకి వచ్చారు. "ఇదిగో మా ఫ్రెండ్ వైదేహి అని చెప్తుంటానే—ఆ ఆంటీ!'' అని పరిచయం చేసింది. నమస్కారం పెట్టేరు. చక్కగా వున్నారు పిల్లలు. ఐదేళ్ల ఆడపిల్లని దగ్గరకు తీసుకుని "ఏం చదువుతున్నావమ్మా?'' అనడిగింది వైదేహి!

"అప్పర్ కే.జి.'' అని చెప్పింది. పేరు ఉమ అంది.

"బాగుంది.. మరి సంగీతం నేర్చుకుంటున్నావా?''

"లేదు... అప్పుడప్పుడు మమ్మీదగ్గర పాటలు నేర్చుకుంటున్నాను.

"అలాగా మరి డాన్సో?...''

"ఉహూ! మా డాడీకిష్టం లేదు.''

"ఓ''—అనుకుంది వైదేహి.

"మీరు మాట్లాడుతూ వుండండి ఇప్పుడే వస్తాను.'' అవర్ణ కిందకి వెళ్లిపోయింది.

ఆరో క్లాసు చదువుతున్న పెద్ద కుర్రాడు... వరుసగా నాల్గు, రెండు చదువుతున్న ముగ్గురు మగపిల్లల్ని పలకరించింది... కాస్సేపయాక మగపిల్లలు వెళ్లిపోయారు. ఉమని దగ్గరకి తీసుకుని కబుర్లు చెప్పింది వైదేహి! ఆ పిల్ల మాట్లాడుతున్న ప్రతి నాల్గోమాట చివర—మా డాడీ తిట్టారనో... మా డాడీని అడగాలనో... అమ్మో మా డాడీ ఊరుకోరనో... అంటోంది!—ఆ సరికి వైదేహి మేధ చురుకుగా పనిచేసింది!

"ఇదిగో పాపా.... డైనింగ్ టేబుల్‌మీద అన్నీ వడ్డించేను. వెళ్లి కాళ్లూ చేతులు కడుక్కుని అన్నయ్యలతోపాటు అన్నం తిను వెళ్లు.'' అంటూ ఓ చేత్తో టిఫిన్ ప్లేటూ, మరోచేత్తో మంచినీళ్లగ్లాసు పట్టుకుని వచ్చింది అవర్ణ.

ఉమ రివ్వున కిందకి పరుగెత్తింది.

"తీసుకో వైదేహీ మొన్న కొత్తగా చేసిన పిండివంట! నేనే కనిపెట్టి చేసేను—ఎలావుందో చెప్పు!'' అని స్టూలు లాగి దానిమీద పెట్టింది.

"చాలా బాగున్నాయి. అపూ! నువ్వు చేసినవి ఏవైనా బాగుంటాయి! మరి మీ మహిళా మండలివారికి నేర్పించేవా?''

అదేలాచూసి "మహిళా మండలా?! అబ్బే నేను ఏ మండలిలోను చేరలేదు... '' అంది.

"అదేం?''....

"నా కిష్టంలేదు... ఏం వుంటుందక్కడ?''

"పోనీ... క్లబ్... అసోసియేషన్....''

"లేదు వైదీ! నేను వాటి జోలికి పోదల్చుకోలేదు...''

"అవునులే... నువ్వే ఓ పెద్ద సంస్థవి! స్వయంగా ఎన్నో చేయగలవు....''

"స్టాపిట్ వైదీ! నేను ఏమీ చెయ్యటంలేదు. చెయ్యాలనుకోటం లేదు... ఏదో ఇలా జీవితం ప్రశాంతంగా వెళ్లిపోతే అంతేచాలు...'' అంది నీర్సంగా. వైదేహి తక్కున లేచి "నా దగ్గర దాచకు నీలో ఇంత నైరాశ్యం... భావశూన్యత ఎందుకు వచ్చింది? మ్యారేజ్ అయ్యాక నువ్వెంతో బాగా రాణిస్తావనుకున్నాను... అసలు నువ్వెంత బిజీగా వుంటావో... ఇంటి దగ్గర వుంటావో వుండవో అనుకున్నాను... చెప్పు అపూ... నీకింట్లో స్వాతంత్ర్యం లేదా? నువ్వనుకున్నవి చేయలేవా?...''

ఆ ఊపు, లాలింపు... అవర్ణని కుదిపేసేయి.

ఎప్పుడో ఎన్నడో మరిచిపోయిన భావన... అంతరాంతరాలలో దాగిన ఆవేదన—ఒక్కసారిగా ఉబికింది. షవర్ కిందనుంచుని తడిసినట్లు—వైదేహి బుజ్జగింపులో పూర్తిగా కరిగిపోయింది అవర్ణ. కన్నీళ్లు జలజలారాలేయి.

"కూర్చో వైదీ!... చెప్తాను, కూర్చో! నువ్వు తింటూ వుండు, నేను చెప్తూవుంటాను'' అని రెండు క్షణాలు ఆగింది అవర్ణ.

'వైదీ! పదమూడు సంవత్సరాల క్రితం—రాజారావుగారి భార్యగా ఈ ఇంట్లో అడుగు పెట్టిననాకు—కొండంత ఉత్సాహంతో పొంగులువారుతూ... నువ్వు ఇప్పుడు అడిగినట్లే ఎన్నో చేయాలనుకున్నాను... కానీ... నా పాలపొంగులాంటి సంతోషం మీద... రాజారావుగారు చన్నీళ్లు చిలకరించటమే కాదు... మరింక పాలు కాగకుండా మంటని చల్లార్చేసారు... 'ఫలానా ఆఫీసర్‌గారి భార్య హోదాలో వుండాలి... అంతే... ఇల్లుదాటి సంఘసేవ దేశ సేవ అంటూ—పదిమంది దృష్టిలో పడకూడదు.... బయటికి వెళ్తే... నలుగురూ నాలుగురకాలుగా చూస్తారు. అది నాకు ఇష్టం వుండదు... మీ మామగారు అసలే సహించరు... ఈ వంశగౌరవం ఎంతో ఉన్నతమైంది. ఇంతవరకు ఏ ఆడదీ ఈ వంశంలో వీధులెక్కలేదు... విద్యావంతురాలివనీ—లోకజ్ఞానం తెలిసిన దానివనీ... ఎందుకుచేసుకున్నానంటే ఇంటినీ... పిల్లల్నీ... తీర్చిదిద్దుకోగలవని. అంతేగాని... ఇల్లుదాటి వెళ్లి తైతక్కలాడమని కాదు'.... అంటూ ఓ పూటంతా తల దిమ్మెక్కించేరు! విదిలించుకుని సౌమ్యంగా నచ్చచెప్పబోయేను. కాని ఓడిపోయేను. వారికి కోపం వస్తే ఉగ్రరూపమే! మామగారు కూడా నన్ను మందలించేరు... మరిది అదోరకం! తనూ తనలోకమే తప్ప ఇంకేదీ పట్టించుకోడు!—వారి ఫ్రెండ్సు... ఆఫీసుపనిమీద కొందరూ... ఎప్పుడు వస్తూనే వుంటారు— సమయంలో నేను ఇంట్లో వుండకపోతే... చిందులు తొక్కుతారు మావారు! నరకంకన్నా ఘోరంగా చేస్తారు ఇంటిని.''

"మమ్మీ! ఒకసారి రా మమ్మీ'' అని పెద్ద కేక వినిపించింది క్రిందినుంచి.

కిందనుంచి ఓ బాబు గొంతు వినిపించింది.

"అవర్ణా! ఏమిటమ్మా పిల్లలకి అన్నాలు పెట్టి వెళ్లిపోతావు?'' అసహనంగా మామగారి కంఠం...

చప్పున కళ్లు తుడుచుకుని... " ఇప్పుడే వస్తాను వైదీ!'' కంగారుగా గబగబా కిందికి వెళ్లిపోయింది అవర్ణ!

వైదేహికి పూర్తిగా అర్థమైపోయింది.. ఆ ఇంటివాతావరణం—అందులో అవర్ణ పాత్ర!! ఆ తర్వాత త్వరగానే సెలవుతీసుకుని వచ్చేసింది వైదేహి!

* * *

పెళ్లిలో వైదేహిని అడిగింది జ్యోతి, "మీ ఫ్రెండెవరో ఆవిణ్ణి పిలుస్తానని వెళ్లావు వదినా, పిల్చావా.... వాళ్లెవరో నాకు పరిచయం చెయ్యవా?''

"పిల్చాను గానీ ఆవిడ వచ్చేట్టులేదు'' అంది వైదేహి నిర్లిప్తంగా.

"ఇంతకీ ఎవరావిడ?''

"నీకు తెలిదులే! హిమాయత్ నగర్‌లో వుంటారు. ఆవిడపేరు అవర్ణ. గవర్నమెంటులో పెద్ద ఉద్యోగం ఆయనకి.... రాజారావుగారని—''

"ఓహో, ఆవిడా? నాకెందుకు తెలీదు? ఆవిడపేరు తెలిదంతే, మేమంతా ఆవిణ్ణి "రాజారావుగారి భార్య'' అంటాం!'' అంది జ్యోతి కూడా తలవంచుకుని. □